
సాక్షి విజయనగరం

శనివారం । 24 । ఆగస్టు । 2024



నిధులున్నా.. నిర్మాణం కనం

గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. - 8లో



ధాన్యం సేకరణ సజావుగా జరగాలి

ఖరీఫ్‌లో పండే ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. - 8లో

26న గ్రీవెన్స్‌సెల్ రద్దు

విజయనగరం అర్బన్: కృష్ణాష్టమి సెలవు కారణంగా ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్) రద్దు చేస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.


న్యూస్‌రీల్

108 చీరలతో కనకమహాలక్ష్మికి అలంకరణ



చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని 108 చీరలతో అర్చకులు అలంకరించారు. శ్రావణ మాసం మూడవ శుక్రవారం అమ్మవారిని అధికమంది భక్తులు దర్శించారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మడ్డువలస ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తివేత



వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద ఆరు గేట్లు ఎత్తి వరద నీటిని అధికారులు కిందకు విడిచిపెడుతున్నారు. వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి 9 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతుండడంతో ప్రాజెక్టు వద్ద 64.45 మీటర్ల లెవెల్ నీటి మట్టం నమోదైంది. దీంతో ఆరు గేట్లు ఎత్తి 14వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడిచి పెడుతున్నామని ఏఈ నితిన్ తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

- అక్రమ రిజిస్ట్రేషన్ ఆరోపణలే కారణం
- శిశోడియా పరిశీలనలో వెల్లడి

శృంగవరపుకోట: ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ శ్యామలను సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. 22ఏలో ఉన్న నిషేధిత ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పార్టీలకు రిజిస్ట్రేషన్ చేసినట్టు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.శిసోడియా ఎస్.కోట, భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేసినట్టు నిర్ధారించి చర్యలకు ప్రతిపాదించడంతో శ్యామలను సస్పెండ్ చేస్తూ జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ విజయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసుల సమస్యలు పరిష్కరిస్తా



పోలీస్ వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్‌డేలో సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. కొన్నింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు.



కన్నీటి కడలిలో..

కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచార దాడిఘటన సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. దీనిపై దేశ వ్యాప్తంగా నిరసన పెల్లుబికింది. వివిధ రూపాల్లో ప్రజలు దాడిని ఖండించారు. ఇదే కోవలో బొబ్బిలికి చెందిన డ్రాయింగ్ టీచర్ కాదూరి రామకృష్ణ వాటర్ కలర్స్‌తో వైద్యవిద్యార్థినిపై జరిగిన దాడికి కన్నీటి నివాళులర్పిస్తూ.. ఆమె కన్నీటి కెరటాలలో కామపిశాచులు కొట్టుకుపోయే దెన్నడు అనే రీతిలో చిత్రంగీసి అందరినీ ఆలోచింపజేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని క్యాప్షన్ జోడించారు. - బొబ్బిలి



కఠినంగా శిక్షించాలి

వైద్యులకు దేశ వ్యాప్తంగా ఒకే విధమైన చట్టం కావాలి. వైద్యులు, పారామెడికల్ సిబ్బందిపై దాడులకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. 2008 యాక్ట్ 11లో ఉన్న మూడేళ్ల జైలు శిక్షను సవరణ చేసి ఏడేళ్లకు పెంచాలి.

- డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు



ఇలాంటి ఘటనలు దారుణం

ఎన్నో ఆశలతో వైద్య వృత్తిలోకి వస్తున్న మహిళలపై ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దారుణం. కోల్‌కత్తాలో జరిగిన ఘటన బాధాకరం. జిల్లాలోని మహిళా వైద్యుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

- డాక్టర్. కె.శ్యామల, ఆర్ఎంఓ, పార్వతీపురం మన్యంజిల్లా ఆస్పత్రి



మారిన సంధ్యారాగం

24.08.2023: 'నాలుగున్నరేళ్లుగా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వానికి ఎన్నికల ముందు గిరిజన వర్సిటీ గుర్తొచ్చిందా? కూల్చడమే తప్ప కట్టడమే తెలియని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, చేసినవాటికే మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు చేయడమే తప్ప చేసిందేమీ లేదు. గిరిజనులు నివసించే జిల్లాను పక్కనపెట్టి మళ్లీ విజయనగరం జిల్లాలోనే నిర్మాణానికి శంకుస్థాపన చేయడం మోసం కాదా? ఆంధ్రా, ఒడిశా సరిహద్దు కొఠియా గ్రామాల నుంచి ఆంధ్రా అధికారులు గోబ్యాక్ అని నినాదాలు చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో శంకుస్థాపన చేయిస్తారా? స్వగ్రామంలో పాఠశాల భవనం నిర్మించలేని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర గిరిజన వర్సిటీ కట్టిస్తారా?'



– ఇదీ సరిగ్గా ఏడాది కిందట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుమ్మడి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలు

23.8.2024: 'ఇది సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలం. ఇక్కడ గిరిజన యూనివర్సిటీకి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసినప్పటికీ సరిపోతుందో లేదోనని కొన్ని అంచనాలు ఉండేవి. ఇక్కడి రైతులు 560 ఎకరాలు ఇచ్చారు. ఇది గిరిజన ప్రాంతానికి కొంత దగ్గరగా ఉంటుంది కాబట్టి ఈ ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ పెడితే బాగుంటుందని చంద్రబాబు ఇక్కడే యూనివర్సిటీని కంటిన్యూ చేద్దామని చెప్పారు. ఇక్కడ భూమి కూడా చాలా బాగుంది. నేషనల్ హైవేకి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. గత ప్రభుత్వం వలే శిలాఫలకాలు వేసి వెళ్లిపోము'



– ఇదీ ఇప్పుడు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో గుమ్మడి సంధ్యారాణి మెంటాడ మండలం కుంటినవలస గ్రామంలో శుక్రవారం మీడియాతో చేసిన వ్యాఖ్యలు.

- మెంటాడ మండలంలోనే గిరిజన విశ్వవిద్యాలయం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్ణయానికే తప్పక మద్దతు
- రెల్లికి మళ్లీ తీసుకెళ్లాలన్న టీడీపీ నాయకుల విఫల ప్రయత్నాలు
- స్థలమార్పిడి వద్దని కేంద్ర ప్రభుత్వం చెప్పేయడంతో తలబొప్పి
- కేంద్ర నిర్ణయాన్నీ విమర్శిస్తూ గతంలో సంధ్యారాణి ప్రకటనలు
- ఇప్పుడు గ్రామ సభల్లో రైతులకు మద్దతుగా సన్నాయినొక్కులు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: నాలుక మడతపెట్టి నాలుగు అబద్ధాలు వల్లించడంలో, అవసరాన్ని బట్టి మాట మార్చేయడంలో గుమ్మడి సంధ్యారాణి కూడా టీడీపీ తానులో ముక్కేనని మరోసారి నిరూపించుకున్నారు. నాడు, నేడు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి ఏడాది కిందట ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసినప్పుడు గిరిజన యూనివర్సిటీ గురించి విమర్శనాత్మకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా గిరిజన యూనివర్సిటీని కొత్తవలస మండలంలోని రెల్లికి మళ్లీ తీసుకెళ్లాలనే విఫల ప్రయత్నాలు చేశారు. తీరా అక్కడ తలబొప్పి కట్టేసరికి సంధ్యారాణికి మళ్లీ గిరిజన ప్రాంతం గుర్తొచ్చింది. శుక్రవారం సాలూరు నియోజకవర్గం మెంటాడ మండలంలోని కుంటినవలసలో నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా వచ్చారు. 'సాలూరు నియోజకవర్గ నాయకురాలివై ఉండి ఇక్కడి నుంచి గిరిజన యూనివర్సిటీని వేరే ప్రాంతానికి తరలించేయడం ఎంతవరకూ న్యాయమమ్మా?' అని కుంటినవలస గ్రామస్తులు ప్రశ్నించేసరికి బిత్తరపోవడం సంధ్యారాణి వంతు అయ్యింది. తమాయించుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. గిరిజన యూనివర్సిటీ మెంటాడలోనే ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. మొత్తమ్మీద సంధ్యారాణికి ఇన్నాళ్లకు జ్ఞానోదయం అయ్యిందని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

'రియల్' ప్రయత్నాలు తేలిపోయినట్లే...

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 ప్రకారం ఉమ్మడి విజయనగరం జిల్లాకు దక్కిన ఏకైక సంస్థ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం. నాడు అధికారంలోనున్న చంద్రబాబు ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్రచారపత్రాల్లో వాడుకొని తమ స్థిరాస్తి వ్యాపారం వృద్ధి చేసుకోవడానికి తప్ప గిరిజనులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని విధంగా శృంగవరపుకోట నియోకవర్గం కొత్తవలస మండలం రెల్లి వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. చట్టం ప్రకారం గిరిజనుల చెంతన యూనివర్సిటీ ఉండాలన్న నిబంధనలను సైతం తుంగలోకి తొక్కి గిరిజనేతర నియోజకవర్గంలో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేసింది. ఈ తప్పులను సరిదిద్ది చట్టం ఆశించిన ప్రయోజనాలను గిరిజనులకు అందించాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్టీ రిజర్వుడ్ సాలూరు నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సువిశాలమైనచోట 561.88 ఎకరాలను కేటాయించింది. మెంటాడ మండలంలోని కుంటినవలస వద్ద గత ఏడాది ఆగస్టు 25న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. భవనాల నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించడానికి వీలుగా రూ.23.60 కోట్లు మౌలిక వసతుల కల్పన పనులకు మంజూరుచేసింది. ఇప్పుడా పనులన్నీ కొలిక్కివచ్చాయి.

తరలింపు ప్రయత్నాలకు కేంద్రం ససేమిరా..

దాదాపు రూ.31.91 కోట్లతో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ పాలకవర్గానికి స్థలాన్ని స్వాధీనం చేసింది. ఈ స్థలం అనువైందని గత ఏడాదే కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఇక భవనాలను నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర ప్రజాపనుల విభాగానిది. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వంలో కొత్తవలస మండలంలో రెల్లి వద్ద యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనుకున్నప్పుడే కేంద్రం సానుకూలంగా స్పందించలేదు. కనీసం అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కూడా హాజరుకాలేదు. పార్టీ ఫిరాయించి మంత్రి పదవి తెచ్చుకున్న సుజయ్ కృష్ణ రంగారావుతో మమ అనిపించేశారు. కానీ చట్టం ప్రకారం అన్నివిధాలా అనుకూలమైన స్థలాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంపిక చేస్తే గుమ్మడి సంధ్యారాణి సహా టీడీపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తదితర టీడీపీ నాయకులు గిరిజన వర్సిటీని మళ్లీ రెల్లికి తీసుకెళ్లే ప్రయత్నాలు చేశారు. ఇటీవల చంద్రబాబు భోగాపురం విమానాశ్రయ పరిశీలనకు వచ్చినప్పుడు ఆమె స్వయంగా కలిసిమరీ అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించారంటూ ఆమె అనుచరులు కొత్తవలసలో పండుగ చేసుకున్నారు. అప్పుడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కనీసం స్పందించలేదు. తమ నియోజకవర్గం నుంచి గిరిజన వర్సిటీ తరలిపోనివ్వనని ప్రకటన కూడా చేయలేదు. మౌనం వహించారు. ఈ తరలింపు సహేతుకం కాదని 'సాక్షి' వరుస కథనాలు ఇచ్చింది. మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సహా పలువురు గిరిజన నాయకులు టీడీపీ నాయకుల ప్రయత్నాలను ఖండించారు. చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా తరలింపునకు ససేమిరా అన్నట్లు తెలిసింది. దీంతో గుమ్మడి సంధ్యారాణి మాట మార్చేయక తప్పలేదు.



రాకెట్ ఆకారం

నేషనల్ స్పేస్ డే సందర్భంగా రామభద్రపురం మండలం కొట్టక్కి ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం రాకెట్ ఆకారంలో ప్రదర్శన ఇచ్చారు. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో భారత్ సాధించిన విజయాలను ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్. భాస్కరరావు, సైన్స్ టీచర్ షేక్ షరీఫ్, పీడీ రత్నకిశోర్, తదితరులు పాల్గొన్నారు. – రామభద్రపురం

తప్పు జరిగితే ఉద్యోగాలు వదులుకోవాల్సిందే!

- జేసీ సేతుమాధవన్ హెచ్చరిక



ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ



ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌ను అడిగి ఇసుక స్లాట్ బుకింగ్ వివరాలను తెలుసుకుంటున్న జేసీ

బొబ్బిలి: ఇసుక తరలింపు ప్రక్రియలో ఏ చిన్న తప్పు జరిగినా ఉద్యోగులు, సిబ్బంది తమ ఉద్యోగాలను వదులుకోవాల్సిందేనని జేసీ సేతుమాధవన్ హెచ్చరించారు. గ్రోత్ సెంటర్ సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. రోజుకు ఎన్ని టన్నుల ఇసుక సరఫరా జరుగుతుందన్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బుక్‌చేసుకుంటున్న ఇసుక పరిమాణం, వాహనాలకు ట్రాన్స్‌పోర్టు పర్మిషన్లు ఉన్నాయా లేదా అన్న అంశాలపై ఆరా తీశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుకను లోడ్ చేయాలని, వరుస క్రమంలో ఇసుకు తరలింపునకు వాహనాలను అనుమతించాలని ఆదేశించారు. రహదారిపై వాహనాలు నిలపకుండా చూడాలని సీఐ సతీష్‌కు సూచించారు. జిల్లాలో జరుగుతున్న నిర్మాణాలకు మాత్రమే ఇసుక సరఫరా చేయాలని, స్లాట్ బుక్‌చేసుకున్న వారి పేరు, ఆధార్, వాహనం డ్రైవర్ పేర్లు వేబిల్లులపై తప్పనిసరిగా ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుక స్లాట్ బుక్‌చేసుకునే తీరును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీను, సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

స్ఫూర్తిప్రదాత టంగుటూరి



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిబ్బంది

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు భావితరాలకు ఆదర్శప్రాయులు, స్ఫూర్తిప్రదాత అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. టంగుటూరి జయంతిని జెడ్పీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు ఆంధ్రకేసరిగా కీర్తిగడించి, గొప్ప సంఘ సంస్కర్తగా ఎదిగారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా సేవలందించారని గుర్తు చేశారు. అటువంటి మహనీయుల అడుగుజాడల్లో నేటి తరం నడుచుకోవాలని, రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్లేయులకు గుండె చూపిన ధీరుడు



టంగుటూరి చిత్రపటానికి సెల్యూట్‌చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: స్వాతంత్య్రోద్యమ నాయకులపై ఆంగ్లేయ అధికారులు కాల్పులు జరపగా.. వారికి ఎదురు నిల్చొని గుండె చూపిన ధీరుడు టంగుటూరి ప్రకాశంపంతులు అని, అప్పటి నుంచి ఆంధ్రకేసరిగా పిలవబడుతున్నారని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో టంగుటూరి జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధునిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా, రాజనీతిజ్ఞునిగా విశేషంగా రాణించి ఆంధ్ర రాష్ట్రానికి జాతీయస్థాయిలో ఎనలేని కీర్తిని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.అస్మాఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐ ఎ.వి.లీలారావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, పోలీస్ కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయులు



టంగుటూరి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్, జేసీ, అధికారులు

విజయనగరం అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు భవిష్యత్ తరాలవారికి ఆదర్శ ప్రాయులని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ప్రకాశం పంతులు జయంతిని కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి 1952లో ఎస్.కోట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారని, మన జిల్లాతో ఆయనకు అనుబంధం ఉండడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, డీఆర్వో ఎస్.డి.అనిత, డీసీసీ కిడారి సందీప్, కలెక్టరేట్ పరిపాలన అధికారి దేవ్‌ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలా... 'కూటమి'సభలా?



ఈ చిత్రంచూశారా? మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద విజయనగరం మండల పరిధిలోని దుప్పాడ గ్రామంలో పనులు గుర్తించేందుకు నిర్వహించిన గ్రామసభ ఇది. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు హాజరయ్యారు. అంతవరకూ బాగానే ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వేదికపై ఉండాలి. కానీ గ్రామానికి ఎలాంటి సంబంధం లేకున్నా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున వారికి ఒకవైపు, జనసేన పార్టీ నాయకురాలు పాలవలస యశస్విని మరోవైపు వేదికపై ఆశీనులయ్యారు. వారు గతంలో కనీసం ఎక్కడా ప్రజాప్రతినిధిగా ఎన్నికైన దాఖలాలు లేవు. కేవలం అధికార దర్పం కోసం ఇలాంటి అధికారిక వేదికలను అలంకరించడమే ఇప్పుడు చర్చనీయాంశమైంది.



ఈ చిత్రం చూశారా? ఇది గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామంలో నిర్వహించిన గ్రామసభ. ఈ గ్రామంతో సంబంధంలేని జనసేన నాయకురాలు పడాల అరుణ ఏకంగా ముఖ్యఅతిథిగా ఆశీనులైపోయారు. ఆమెతో పాటు ప్రజాప్రతినిధులు కాని టీడీపీ నాయకులు కూడా వేదికపైకి ఎక్కడానికి పోటీపడ్డారు. టీడీపీ మండల అధ్యక్షుడు అట్టాడ లక్ష్మునాయుడు కాగితాలు పట్టుకొని మరీ హంగామా చేశారు. టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మైథిలీ ప్రియాక భర్త, హర్షవర్ధన ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ ప్రదీప్‌కుమార్‌కు కూడా వేదిక పైకి చోటుకల్పించడం గమనార్హం.

- గ్రామసభల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలు
- వేదికలపై కూటమి పార్టీ నాయకుల హంగామా

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అధికారిక కార్యక్రమాల్లో అనధికార వ్యక్తుల పెత్తనమేనా ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కు పరిపాలనా విధానమా? అని జరుగుతున్న చర్చకు శుక్రవారం జరిగిన గ్రామసభలు మరో నిదర్శనంగా నిలిచాయి. ఎక్కడికక్కడ ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నా అధికారులు కిక్కుమనలేదు. చివరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాజరైన కార్యక్రమంలోనే టీడీపీ, జనసేన నాయకులు వేదికపై ముందు వరసలో కూర్చుంటే వారించలేని పరిస్థితి. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చించేందుకు ఉద్దేశించిన గ్రామసభలు కాస్తా కూటమి పార్టీల నాయకుల హంగామాతో గతి తప్పాయి. ఎక్కడికక్కడ అధికార దర్పం ప్రదర్శనకు ఈ కార్యక్రమాలను వేదికగా చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్కడికక్కడ రసాభాస...

- నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ మండలం కనిమెల్ల గ్రామసభ దద్దరిల్లింది. ప్రభుత్వ భూముల ఆక్రమణలు మీరు చేశారంటే మీరు చేశారని సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ భూములు, వాగులు, చెరువులు ఆక్రమణల్లో ఉంటే తొలగించాలని గ్రామ సర్పంచ్ నడిపేన రమణ సభకు చెబుతుంటే కూటమి పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగారు.
- రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలం చిత్తారిపురం పంచాయతీలో టీడీపీ కార్యకర్తలు హంగామా చేశారు. గ్రామ సచివాలయం వద్ద జరుగుతున్న గ్రామ సభకు చేరుకుని అధికారులను ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేశారు. ఎటువంటి పదవులు లేకపోయినా తమ పార్టీ అధికారంలో ఉందని, తమకు కుర్చీలు వేయాలని పట్టుబట్టారు. అధికారులు నచ్చజెప్పినా వినిపించుకోకుండా వాగ్వాదానికి దిగారు. అధికారులపై బెదిరింపులకు దిగారు. పోలీసులు రంగప్రవేశంచేసి పరిస్థితిని చక్కదిద్దారు.
- ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే లలితకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం ఉప సర్పంచ్ మోపాడ కుమార్‌ను ఆహ్వానించాల్సి ఉన్నప్పటికీ పిలవకుండా ఆయనను అవమానించారు.

కుంకుమ పూజలో మహిళా భక్తులు



భక్త తీర్థం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామ స్వామి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించి తరువాత శ్రీరామచంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మంటపంలో వేంచేపుజేశారు. మంటపంపై అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తికి పుష్పార్చన, మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. స్వామికి సుందరకాండ పారాయణం, పట్టాభిషేకమహోత్సవాలను చేపట్టారు. మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం జరిపించి గాజులతో విశేషంగా అలంకరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఈఓ వై శ్రీనివాసరావు, టీడీపీ మండల నాయకులు సువ్వాడ రవిశేఖర్, లెంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

రామభద్రపురం: శ్రీకాకుళంలో ఈ నెల 17,18,19 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలలో ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలుర జట్టులో ఎం.జ్యోతిప్రకాశ్, డి రాఘవ, బాలికల జట్టులో ఎ.భువనేశ్వరి, కె. మధురిమ, పి జైశ్రీలు ప్రథమ స్థానం సాధించారని పీడీ వి.అప్పలనాయుడు తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఎస్.జీ.శర్మ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



శాటిలైట్, రాకెట్ మోడల్ ఆకారంలో ఏర్పడిన విద్యార్థినులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆగస్టు 23, 2023వ సంవత్సరంలో చంద్రయాన్ -3 చంద్రుని సౌత్ పోలార్‌పై సాఫ్ట్‌ల్యాండింగై చరిత్ర సృష్టించింది. చంద్రుని దక్షిణ ధృవాన్ని తాకిన మొదటి దేశంగా వరల్డ్ రికార్డు సృష్టించింది భారతదేశం. దీనిలో భాగంగా ప్రతి ఏటా ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డేగా సెలబ్రేట్ చేసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ క్రమంలో సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన శాటిలైట్ మోడల్, రాకెట్ మోడల్, స్పేస్ స్టేషన్ మోడల్‌ను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

శృంగవరపుకోట: అక్రమంగా బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను ఎస్.కోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్‌కోట ఎస్సై సీహెచ్.గంగరాజు నేతృత్వంలో సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా అరకు నుంచి వైజాగ్ వైపు స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపి సోదా చేయగా వారి వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, స్కూటీని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్న యువకులను అరుకువేలీకి చెందిన శెట్టి ఉదయ్‌కుమార్, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన గుండాల యేసుగా గుర్తించి, నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ వీఎస్.మూర్తి తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని మహిళ మృతి

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలంలోని దబ్బగెడ్డ గ్రామానికి చెందిన ఇప్పాకుల పార్వతమ్మ(59) తన మనుమరాలును యాగాటి మంజును ఆశ్రమపాఠశాలలో 3వతరగతిలో చేర్పించేందుకు బయల్దేరింది. అయితే ఆ బాలిక రెండో తరగతి చదివిన పాఠశాలలో టీసీ తీసుకునేందుకు మనుమరాలు, మరో వ్యక్తితో కలిసి పాచిపెంట మండలం కర్రివలసకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ఆటోను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డుపై జారిపడి తీవ్రంగా గాయపడిన పార్వతమ్మను స్థానికులు వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అంతలోనే మృతిచెందింది. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్యామ్ తెలిపారు.



ఆలోచనా విధానంలో మార్పురావాలి

పురుషుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. మహిళను తన సొంత తల్లి, చెల్లి, అక్కగా భావించే తత్వం అలవరుచుకోవాలి. విధులు నిర్వహించే ప్రదేశాల్లో ఉన్నతాధికారుల ఒత్తిడి ఉండకూడదు. తల్లిదండ్రులు సైతం మగ పిల్లలకు తరచూ కౌన్సెలింగ్ ఇస్తూ ఉండాలి. వారి ప్రవర్తనపై దృష్టి సారించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా వైద్య సిబ్బందికి రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. బాత్‌రూమ్ సదుపాయం, డ్రెస్ చేంజ్ చేసుకునేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ప్రేమకుమారి, హెడ్‌నర్స్, పార్వతీపురం



భయపడేలా చట్టాలు ఉండాలి

వైద్యులపై దాడిచేయాలంటే భయపడే విధంగా చట్టాలు రావాలి. ఐసీయూ, అత్యవసర విభాగాల్లో నిరంతరం పర్యవేక్షించే పోలీస్ వ్యవస్థ ఉండాలి. మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి. వైద్య సిబ్బందికి ప్రత్యేక మహిళా అటెండర్‌ను నియమించాలి. అత్యవసర కేసుల విషయంలో రాత్రి సమయంలో ఆస్పత్రికిరావాల్సి వచ్చినప్పుడు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలి. ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ అజయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



నిధులున్నా.. నిర్మాణం కనం

- ఇంజినీరింగ్ నిర్లక్ష్యం–రహదారులకు శాపం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.13 కోట్లు మంజూరు
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో 19 రహదారులకు కలగని మోక్షం
- శంకుస్థాపన చేసి 8నెలలైనా ప్రారంభం కాని పనులు
- గిరిజనులకు తప్పని కష్టాలు


పనులు జరగాల్సిన సోమగండి రహదారి

సీతంపేట:

గిరిజన గ్రామాలన్నింటికి పూర్తిస్థాయిలో రహదారులు నిర్మించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్‌లో రహదారులు మంజూరు చేసింది. రహదారులు మంజూరై 8 నెలలు కావస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించని పరిస్థితిలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్‌శాఖ ఉంది. దీంతో కొన్ని గ్రామాలకు సరైన రహదారులు లేక గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం జరిగితే అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించడానికి, అలాగే జ్వరం, ఇతర వ్యాధులు వచ్చినప్పుడు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల అనారోగ్య పరిస్థితుల్లో అత్యవసర సమయాల్లో 108, ఇతర అంబులెన్సులలో పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు తీసుకు వెళ్లడానికి వీలవుతుంది. ఈ క్రమంలో ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ హయాంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలో పాలకొండ నియోజకవర్గంలో 19 రహదారులు నిర్మించడానికి డ్వామా అధికారులు అనుమతి ఇచ్చారు. అప్పట్లోనే కొన్ని రహదారుల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన సైతం చేశారు. అయితే వాటికి ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని పరిస్థితి ఉంది.

మంజూరైన రహదారులు ఇవే..

సీతంపేట మండలంలోని గుడ్డిమీదగూడ నుంచి కుమ్మరగండి వయా దబర మీదుగా సీసీ రోడ్డు వేయడానికి రూ.కోటి 20లక్షల వ్యయంతో అంచనాలు రూపొందించారు. అలాగే సవర జజ్జువ నుంచి జాతాపు జజ్జువ, బిన్నిగూడకు రూ.కోటి 30 లక్షలు కేటాయించారు. వెలగాపురం–చాపరాయిగూడ రహదారి నిర్మాణానికి రూ.45లక్షలు, దారపాడు నుంచి దంజుపాయికి రూ.90 లక్షలు, సీఎస్‌పీ రహదారి నుంచి సోమగండికి రూ.60లక్షల నిధులు మంజూరయ్యాయి.

☛ పాలకొండ మండలంలో రూ.40లక్షలతో వెలగాడ నుంచి పీఆర్ రాజుపేట, లుంబూరు సీసీ రహదారికి రూ.80లక్షలు కేటాయించారు. మల్లివీడు నుంచి చంద్రయ్యవలసకు రూ.50లక్షలు, పీహెచ్ రహదారి నుంచి సింగన్నవలసకు రూ.30లక్షలు, ఎం.సింగుపురంలో మరో సీసీ రహదారికి రూ.40లక్షలు కేటాయించారు.

☛ భామిని మండలంలో రూ.60లక్షలతో ఏహెచ్ రోడ్డు నుంచి నేరెడు, మరో రూ.60లక్షలతో దిమ్మిడిజోల నుంచి లోవగూడ, రూ.కోటి 50లక్షలతో జోలమానుగూడ నుంచి బుచ్చిమానుగూడ రోడ్డు, రూ.60లక్షలతో ఘనసర తాటిమానుగూడ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి.

☛ వీరఘట్టం మండలంలో సీఎస్‌పీ రోడ్డు యు.వెంకంపేట, చిదిమి సచివాలయం వరకు రూ.50లక్షలు, అడారు సెంటర్ నుంచి డెప్పివలసకు రూ.50లక్షలు కేటాయించారు. సీఎస్‌పీ రహదారి నుంచి చిట్టిపుడివలస బీటీరోడ్డుకు రూ. కోటి 20లక్షలు, బిటివాడ హైస్కూల్ నుంచి చెబియంవలసకు రూ.40లక్షలు, చిదిమి రోడ్డు నుంచి సీఎస్‌ఆర్ పేటకు రూ.30లక్షలు కేటాయించారు.

త్వరితగతిన నిర్మించాలి



త్వరితగతిన రహదారులు నిర్మించాలి. ప్రాధాన్యతా క్రమంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు రోడ్లు మంజూరు చేసింది. రహదారుల నిర్మాణం పూర్తయితే గిరిజనులకు ఇబ్బందులు తొలగు తాయి. అర్ధాంతరంగా ఆగిన రహదారులు కూడా ఉన్నాయి. వాటిని కూడా సకాలంలో పూర్తి చేయాలి

విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

రహదారుల నిర్మాణానికి చర్యలు



నియోజకవర్గంలో పలు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైన మాట వాస్తవమే. కొన్ని కారణాల వల్ల పనులు జరగలేదు. త్వరలోనే పనులు పూర్తిస్థాయిలో జరిగేలా చూస్తాం. దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

సింహాచలం, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ

ధాన్యం సేకరణ సజావుగా జరగాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: పొలం నుంచి మిల్లర్‌కు వెళ్లే వరకు అవసరాలన్నిటినీ ఏర్పాటు చేసుకుని ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన వాహనాలు, గన్నీ సంచులు, హమాలీలు, తేమ యంత్రాలు, గోడౌన్ సామర్థ్యం, బ్యాంకు గ్యారంటీలు, తూనిక యంత్రాలు తదితర సామగ్రిని నెలరోజుల ముందే ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే ధాన్యం సేకరణలో పని చేసే సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులు, ఎఫ్‌పీఓలు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 4.5 లక్షల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని అంచనా వేస్తున్నామని ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం మద్దతు ధర క్వింటాకు కామన్ వెరైటీ రూ.2300గా, గ్రేడ్ ఎ వెరైటీ రూ.2,320గా నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ ధరలను గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రతి రైతుకు తెలిసేలా అవగాహన కలిగించాలని సూచించారు. అదే విధంగా రైతు సేవా కేంద్రాల్లో కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన టైమ్ లైన్ ప్రకారం ధాన్యం సేకరణ జరిగేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైస్ మిల్లర్ల సమస్యలపై బకాయిలపై ప్రభుత్వానికి లేఖ రాసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని లక్ష్యాన్ని చేరుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం


రైలు పట్టాలపై మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి–బోడసింగిపేట గ్రామాల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీరావు శుక్రవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, రైలు పట్టాలు దాటుతుండగా కానీ, రైలు నుంచి జారి పడి కానీ మృతి చెందాడా? అన్నది తెలియరాలేదని చెప్పారు. మృతదేహాన్ని విజయనగరంలోని మహరాజా కేంద్రాస్పత్రిలో భద్రపరిచామని, మృతుని చేతిపై ఇంద్రాదేవి అన్న పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666122722,9491813163 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గరివిడిలో మరో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణానికి కొద్దిపాటి దూరంలో రైల్వే పట్టాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై ఎం.మధుసూదనరావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 64 సంవత్సరాలు ఉండొచ్చని, శరీరంపై కాషాయం రంగు లుంగీ, తెలుపు రంగు కమీజు ధరించి ఉన్నాయని చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ 9491106219 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ఇందు రెసిడెన్సీలో చోరీకి పాల్పడిన దొంగను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆగస్టు 10న ఇందు రెసిడెన్సీలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు, తాళం విరగ్గొట్టి లోనికి చొరబడి విలువైన వెండి వస్తువులను దుండగుడు చోరీ చేశాడు. అదేవిధంగా ఆగస్టు 12న స్థానిక శ్రీనివాస కళాశాల దగ్గర ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి ఇంటి తలుపులు విరగ్గొట్టి ఇంట్లో చొరబడి లక్ష రూపాయల విలువైన వాచ్, కొంత నగదు, యాపిల్ ఫోన్ ఇయర్ బడ్స్‌ను దొంగిలించాడు. ఈ రెండు కేసులకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. విచారణలో తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట, కొండపాక మండలానికి చెందిన డి.లింగం నేరం ఒప్పుకోగా అరెస్ట్ చేసి లక్షకు పైగా విలువ కలిగిన వాచ్‌ను , ఇయర్ ప్యాడ్స్, వేరే కేసులో వెండి ఆభరణాలు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసుల్లో నిందితుడ్ని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ ఎస్సై జె.తారకేశ్వరరావు, సిబ్బంది అచ్చిరాజు, కానిస్టేబుల్ గౌరీశంకర్, శివ, శ్రీనివాస్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

సుమను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ డిమాండ్
- మున్సిపల్ కమిషనర్‌కు వినతి


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ కార్యాలయంలో పని చేస్తున్న పువ్వల సుమపై ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా విధులనుంచి తప్పించడం అన్యాయమని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా పువ్వల సుమపై వస్తున్న ఆరోపణలపై పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌తో సీఐటీయూ నాయకులు శుక్రవారం చర్చించారు. ఆమెపై వస్తున్న ఆరోపణలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆధారాలతో సహా రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అంతే కానీ నేరం రుజువుకాక ముందే విధులను నిర్వర్తించకుండా నిలిపివేయడం అన్యాయమని మండిపడ్డారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.ఇందిర, కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ కక్షపూరిత చర్యలలో భాగమని, ఫిబ్రవరి నెలలో విధుల్లో చేరిన పువ్వల సుమపై లేని ఆరోపణలు, ఒత్తిళ్లు ఈ మధ్య కాలంలో ఏమిటని ప్రశ్నించారు. కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి తప్ప, పూర్తిగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బంకురు సూరిబాబు, ఎస్. ఉమామహేశ్వరరావు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి


సన్యాసినాయుడు మృతదేహం

గుర్ల: మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్రాంచ్ కార్యాలయం మేడపై మద్యం మత్తులో ఒక వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడు (40) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులతో కలహాలు రావడంతో ఇంటికి కూడా వెళ్లేవాడు కాదు. రెండు నెలలుగా విపరీతంగా మద్యం తాగుతు ఉండేవాడు. ఏపీజీవీబీకి వచ్చిన ఖాతాదారులకు చెడు వాసన రావడంతో కార్యాలయం మేడపైకి వెళ్లి పరిశీలించగా అక్కడ సన్యాసినాయుడు మృతదేహం ఉండడంతో స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం మత్తులో నీరు అందక మృతి చెంది ఉంటాడని, మూడు రోజుల క్రితం మరణించినట్లు మృతుని కుటుంబసభ్యులు చెబుతున్నారు. మృతునికి భార్య సత్యవతి , కుమారుడు, కూమర్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు ఏఎస్సై కామేశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సీతమ్మధార బ్రాంచ్ (05401)
యూనియన్ బ్యాంక్ బిల్డింగ్స్, పాత ఈనాడు ఆఫీసు ప్రక్కన, సీతమ్మధార, విశాఖపట్నం-530013.
ఫోన్: 91602 12300, 83558 05401. ఇ-మెయిల్ ఐడి: ubin0805408@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీతమ్మధార బ్రాంచ్ వారికి తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారివే ... "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 26.09.2024న విక్రయించబడుతుందని ...

ఇ-వేలం తేది & సమయం: 26.09.2024, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సొమ్మును సమర్పించుటకు ఆఖరి తేది: 25.09.2024, సా॥ 4.00 గం.ల లోపు

[illegible] ... బకాయి మొత్తం: రూ. 8,17,721.75 ... తేది. 24-12-2023 నుండి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు

[illegible]

రిజర్వు ధర: రూ. 14,67,000/- ధరావత్తు: రూ. 1,46,700/- బిడ్ పెంపుదల: రూ. 15,000/-

... https://ebkray.in ... https://ebkray.in ... www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లో రూలు 8 (6) / రూల్ 9(1) / రూల్ 6(2) క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన ...

తేది : 17.08.2024, స్థలం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వసతిగృహ విద్యార్థికి పాముకాటు

- సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన వైద్యులు
- పరిస్థితి విషమించడంతో విజయనగరం రిఫర్


పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థి పురుషోత్తం

చీపురుపల్లి: పట్టణంలోని సమీకృత బాలుర సంక్షేమ వసతిగృహంలో విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. పాముకాటుకు గురైన విద్యార్థిని వసతిగృహ సంక్షేమాధికారులు హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చేర్పించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిక సమీకృత బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న మెరకముడిదాం మండలంలోని రామాయవలసకు చెందిన వెంపడాపు పురుషోత్తం వసతిగృహం సమీపంలో శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో వసతిగృహం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్దకు వేప పుల్ల కోసం వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో అదే దారిలో ఉన్న ఆర్‌డీఓ కార్యాలయం ప్రధాన గేటు ఎదురుగా పాము కాటు వేసింది. ఈ విషయం తెలుసుకున్న వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. విద్యార్థిని కాటు వేసింది విషసర్పమేనని వైద్యులు ధ్రువీకరించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేశారు.

విద్యార్థి బయటకు రావడంపై విమర్శలు..

ఇదిలా ఉండగా వసతిగృహం ఆవరణలోనే ఉండాల్సిన విద్యార్థి పురుషోత్తం బయటకు రావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 6.30 గంటలకు విధుల్లో ఉండాల్సిన వసతిగృహ సంక్షేమాధికారి ఉన్నారా? లేరా? అనే అనుమానాలతో పాటు విధుల్లో ఉంటే విద్యార్థిని బయటకు ఎలా పంపిస్తారనే చర్చ జరుగుతోంది. ఇదే వసతిగృహానికి చెందిన ఓ విద్యార్థి రెండేళ్ల క్రితం పాము కాటుకు గురై తీవ్ర ఇబ్బందులు పడిన అంశం మరోసారి స్థానికంగా చర్చకు వస్తోంది.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

పాముకాటుకు గురై స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థి పురుషోత్తంను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పరామర్శించారు. పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు సీహెచ్‌సీకు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

RENT / SALE
■ VZM, అలకానంద కాలనీ, గోకపేట జంక్షన్ వద్ద లక్ష్మీనివాస్2 అపార్ట్‌మెంట్‌లో 3 బెడ్‌రూం, కార్ పార్కింగ్‌తో అద్దెకు, ఇక్కడే 28x63 సైట్‌సేల్ & VSP, సాగర్ నగర్‌లో HIG2-110,GF (క్రింది ఇల్లు) అమ్మబడును. Cont: 9440189123, 6300393800 [S-1243471]

FLAT FOR SALE
■ 2 BHK, S2, 950 Sft. Sai Bhaskar Vihar, Ayyannapeta, Pal Nagar, Vizianagaram. Rs. 17 Lakhs (Negotiable). Cont : 99123 35851 [V- 0338]

WANTED
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ sal: 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 81218 18692 [G-9005]

■ కన్సల్టెన్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. ఫోన్: 7995984445 [HA-98255]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796269]

■ ప్రముఖ ఎయిర్ పోర్ట్‌లో పని చేయటానికి కార్గో సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, క్యాబ్‌డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం:28000 నుంచి 34000 రూం+భోజనంఫ్రీ.Ph: 9133671684 [HA-515]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.